ఆంధ్రజ్యోతి





కిచెన్‌షెడ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సీఎం



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

బహిరంగ సభకు హాజరైన ప్రజలు



మహిళా సంఘాల బస్సును ప్రారంభిస్తున్న సీఎం, మంత్రులు

బహిరంగ సభ విజయవంతం

కొడంగల్‌లో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. ప్రతీ గ్రామం నుంచి పార్టీ శ్రేణులు, ప్రధానంగా మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా కాంగ్రెస్ నాయకులు కృషి చేశారు. సీఎం సభ విజయవంతం.. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా, పోలీస్ ఉన్నతాధికారులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

మోడల్‌గా కొడంగల్

దేశంలోనే గుర్తింపు వచ్చేలా అభివృద్ధి

అభివృద్ధి పరంగా దేశంలోనే కొడంగల్ నియోజకవర్గాన్ని ఓ మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గత 70 ఏళ్లుగా ఈ ప్రాంతం విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనకబాటుతనాన్ని ఎదుర్కొందన్నారు. కొడంగల్ ప్రాంతంలో విద్యా, పారిశ్రామికపరంగా అభివృద్ధి పరుగులు పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం అన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో సోమవారం పలువురు రాష్ట్ర మంత్రులు, అధికారులతో కలిసి ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొడంగల్‌లో నిర్వహించిన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



సీఎంతో ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి

- ఆడబిడ్డల సంతోషంతోనే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి
- విద్య, వైద్యం, ఉపాధి, సాగునీటిపై ప్రత్యేక దృష్టి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మొత్తం రూ.103 కోట్లతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

కొడంగల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలు సంతోషంగా ఉంటేనే ఆర్థికాభివృద్ధి జరుగుతుందని, మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తాపట్నాయక్ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి అక్షయ పాత్ర గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌షెడ్ నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. అనంతరం మొత్తం రూ.103 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొడంగల్ పట్టణంలోని ఎన్కెపల్లి గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. అన్ని రకాల ఉన్నత

మిగతా 7వ పేజీలో...



సీఎం అపర భగీరథుడు: మంత్రి దామోదర

ప్రజా సేవకుడిగా మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్‌రెడ్డి అపర భగీరథుడిగా ముందుకు సాగుతున్నారని మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కొడంగల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని ఈ ప్రాంత ప్రజలు అదృష్టంగా భావించాలన్నారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. అందుకే సీఎం విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి చెప్పారు.



దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ : మంత్రి వాకిటి

సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కొడంగల్ ప్రాంతం అభివృద్ధి పథంలో సాగుతోందని రాష్ట్ర మంత్రి మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సాగు, తాగునీరు, విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామి కానుందని చెప్పారు. కార్యక్రమంలో పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి, రాజేశ్‌రెడ్డి, విజయకుమార్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ స్నేహ మెహ్రా



వేదికపై నృత్యం చేస్తున్న మహిళలు

18.01 శాతమే



జిల్లాలో బీసీలకు దక్కిన రిజర్వేషన్లు

పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా అధికారుల సమక్షంలో సర్పంచ్ రిజర్వేషన్లు, మండలాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఈ రిజర్వేషన్లను ఆదివారం మరోసారి పరిశీలించి తుది నివేదికను ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించిన తర్వాత కలెక్టర్ ప్రతీక్‌జైన్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే రిజర్వేషన్ల కేటాయింపుల్లో రొటేషన్ విధానంతో బీసీ రిజర్వేషన్లు భారీగా తగ్గాయి. కేవలం 18.01శాతమే దక్కాయి. 2019 ఎన్నికలతో పోలిస్తే బీసీలకు తక్కువ స్థానాల కేటాయింపు జరగడం గమనార్హం.

పంచాయతీలు పెరిగినా భారీ కోత

- రొటేషన్ పద్ధతితో బీసీలకు తగ్గిన స్థానాలు
- 2019లో 126 స్థానాలు.. ఈసారి 107
- ఎస్సీలకు 111, ఎస్టీలకు 119 స్థానాలు రిజర్వు
- మొత్తంగా 257 పంచాయతీలు అన్ రిజర్వుడ్
- తేలిన పంచాయతీల రిజర్వేషన్ల లెక్క
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కలెక్టర్

వికారాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 20 మండలాల పరిధిలో 594 పంచాయతీలు, 5,058 వార్డులు ఉన్నాయి. 594 సర్పంచ్ స్థానాల్లో 278 మహిళలకు కేటాయించగా, 316 అన్ రిజర్వుడ్ (జనరల్)కు కేటాయించారు. వంద శాతం ఎస్టీ జనాభా కలిగిన పంచాయతీల్లో 92 స్థానాలను ఎస్టీలకే రిజర్వు చేయగా, వాటిలో 47 మహిళలకు, 45 అన్ రిజర్వుడ్‌కు కేటాయించారు. ఎస్టీలకు 27 కేటాయించగా, వాటిలో 7 మహిళలకు, 20 అన్ రిజర్వుడ్‌గా

మిగతా 8వ పేజీలో...



నేడు మోమిన్‌పేట్‌కు

స్పీకర్ రాక

మోమిన్‌పేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం మోమిన్‌పేట్ మండలానికి రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని కాస్లాబాద్‌లో నంది వాగు ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల, మోమిన్‌పేట్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ, దేవరంపల్లి గ్రామంలో రూ.47 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తారని తెలిపారు. అదే విధంగా 2024-2025 సంవత్సరం ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను సైతం ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.



మంబాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

దేశాభివృద్ధికి బీజేపీ దిక్సూచి

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పెద్దేముల్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): భారతదేశ ఐక్యత, అభివృద్ధికి బీజేపీ దిక్సూచీ వంటిదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో ఆయన సోమవారం 30 అడుగుల బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ దరిద్రులు తాను ఆపరేషన్ తర్వాత చనిపోవాలని కోరుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఐక్యత పెరగడానికి కారణం బీజేపీ, ప్రధాని మోదీ కారణమన్నారు. కేంద్రం ఇచ్చే నిధులను పేర్లు మార్చి తామే ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పుకుంటున్నాయని అన్నారు. బీఆర్ఎస్ కుటుంబ పాలనలో కేసీఆర్, కేటీఆర్ రాష్ట్రాన్ని దివాలా తీయించారన్నారు. దివాలా తీసిన రాష్ట్రంలో రైతులను ఆదుకుంటున్నది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమని చెప్పారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే కింది స్థాయి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకు బీజేపీ గెలవాలని ఆకాంక్షించారు. కేంద్రం కొన్ని పథకాలకు 70 శాతం నిధులు ఇచ్చి 30శాతం రాష్ట్ర వాటా కోరుతుందన్నారు. అయితే ఆ 30శాతం కూడా పెట్టుబడి పెట్టలేక రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేయడం లేదని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండింటికి పొత్తు ఉందన్నారు. మునుగోడులో బీజేపీని ఓడించేందుకు రెండు పార్టీలు ఒక్కటయ్యాయన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రకు బీఆర్ఎస్ వాళ్లే ఆర్టీసీ బస్సులను పంపించారని ఆరోపించారు. బీఆర్ఎస్-కాంగ్రెస్ పార్టీలకు పొత్తు ఉన్నందునే కేటీఆర్‌ను జైలుకు పంపే ధైర్యం చేయడం లేదని విమర్శించారు. తప్పు చేసిన కవితను తాము జైలుకు పంపించామన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ప్రహ్లాద్‌రావు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఉప్పరి రమేశ్ కుమార్, వడ్ల నందు, బాలేశ్వర్‌గుప్తా లలిత, సాహుశ్రీలత, బంటారం లావణ్య, రజినీకాంత్, నాగారం మల్లేష్, సందీప్‌కుమార్, వీరేశం, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు వేగవంతం



తాండూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాండూరు - వికారాబాద్ బీటీరోడ్డు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మరో 15 రోజుల్లో పూర్తి స్థాయిలో బీటీ రోడ్డు పనులు పూర్తి కానున్నాయి. రూ.110 కోట్ల వ్యయంతో రోడ్డు పనులు ఏడాదిగా నత్తనడకన సాగినప్పటికీ రెండు నెలలుగా పనులు వేగవంతం చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారుల ఎప్పటికప్పుడు పర్యవేక్షణతో పాటు మీర్జాగూడ ఘటన తర్వాత కాంట్రాక్టర్లు వెంటనే స్పందించడం ఈ రోడ్డు పనులకు మోక్షం కలిగింది. ఈ పనుల అనంతరం యాలాల మండలం బాగాయిపల్లి ఈ రోడ్లను డిసెంబరు నాటికి పూర్తి చేసేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.



ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలన

దుద్యాల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి, హకీంపేట్ గ్రామాల శివారులో 224.04 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను సోమవారం మేనేజింగ్ డైరక్టర్ ఈడబ్ల్యూ ఐడీసీ గణపతిరెడ్డి పరిశీలించారు. పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏ ఏ విద్యాసంస్థలు ఎక్కడ నిర్మిస్తున్నారన్న అంశాలపై ఆరా తీశారు. త్వరలో పనులను ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయభాస్కర్‌రెడ్డి, డీఈఈ రాజయ్య, ఏఈఈలు జనార్ధన్ మూర్తి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



బోనాలతో మహిళల ఊరేగింపు

తాండూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిధిలోని అంతారం గ్రామంలో అంజనేయ స్వామి ఆలయ సమీపంలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ముందుగా దివ్యస్తంభం, నాగదేవతలు, నవగ్రహాలు, అంజనేయ స్వామి విగ్రహమూర్తులను గ్రామంలో ఊరేగించారు. దేవతమూర్తులకు మహిళలు భక్తులు జలాభిషేకంతో మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం వేళ బొడ్రాయిని ప్రతిష్ఠాపించి బోనాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పుల్ల వెంకట్‌రెడ్డి, వడ్డె శ్రీనివాస్, ఎత్తరి రాములు, వడ్డె చంద్రయ్య, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ, శాంత్‌కుమార్, కొస్గి ఆశన్న, సంపత్‌కుమార్, నర్సిములు పాల్గొన్నారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు గణపతి హోమాలు, పలు పూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

మరకత శివలింగాన్ని దర్శించుకున్న సినీనటి దివి



శంకర్‌పల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చందిప్పలో ఉన్న మరకత శివలింగాన్ని సోమవారం సినీనటి దివిదర్శించుకున్నారు. శివలింగానికి ఆమె పూజలు, అభిషేకాలు చేశారు. ఆమెకు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్‌స్వామి, వైస్‌చైర్మన్ శేఖర్ స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని లక్ష్మీగార్డెన్‌లో సోమవారం నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి హాజరయ్యారు. లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ యాటగీత నర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు జగన్, మానయ్య, నర్సింహ, విజయ్, శ్రీను, బాబ, ఫరీద్, రమణారెడ్డి పాల్గొన్నారు.

నీటి శుద్ధి కేంద్రాలతో పర్యావరణ పరిరక్షణ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని, మురుగునీటి శుద్ధికి ఎస్టీపీలు కీలకపాత్ర పోషిస్తాయని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. సోమవారం రావిర్యాలలో రూ.25 కోట్లతో నిర్మించే మురుగు నీటి శుద్ధి కేంద్రానికి ఆమె శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే చెరువులు, కుంటల పునరుద్ధరణ, సుందరీకరణ పనులు భారీగా చేపట్టామని తెలిపారు. రావిర్యాలలోనూ ఎస్టీపీని మంజూరు చేశామని చెప్పారు. రావిర్యాల, జల్పల్లి, మీర్‌పేటల్లోనూ ఇలాంటి ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. చెరువులు కబ్జా కాకుండా హద్దురాళ్లు పాతాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు రాజ్‌కుమార్, సుజాత, భానుచందర్, తుక్కుగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మయ్య, సురేష్, ఎస్.రాజు, రవినాయక్ పాల్గొన్నారు.

బ్రిడ్జి లేక ఇక్కట్లు

- నీటిపై ప్రమాదకరంగా ప్రయాణం
- స్టేషన్ తిమ్మాపూర్ కల్వర్టు వద్ద పొంచి ఉన్న ముప్పు
- వెంటనే బ్రిడ్జి నిర్మించాలంటున్న స్థానికులు



తిమ్మాపూర్-చేగూర్ రోడ్డులో ఉన్న కల్వర్టు వద్ద వర్షపు నీటి నుంచి వెళ్తున్న వాహనాలు

కొత్తూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్-చేగూర్‌కు రోడ్డులో స్టేషన్‌తిమ్మాపూర్ సమీపంలో ఉన్న కల్వర్టు వాహన చోదకులను భయాందోళనలు కల్గిస్తోంది. కొన్నేళ్ల క్రితం రోడ్డు వేశారు గానీ బ్రిడ్జి నిర్మించలేదు. వర్షపు నీరు కల్వర్టు మీదుగా వెళ్తుంది. ఒంపు ప్రాంతంలో కల్వర్టు వద్ద రోజూ నీరు పారుతోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కొత్తూర్, నందిగామ, షాబాద్ మండలాల గ్రామాలకు ఈ కల్వర్టు మీదుగానే వెళ్తున్నారు. ముఖ్యంగా నందిగామలోని కన్హాశాంతి వనానికి నిత్యం వందలాది వాహనాలు వచ్చిపోతుంటాయి. రాత్రి సమయాల్లో రోడ్డు నీరు పారుతున్నచోట వాహనాల డ్రైవర్లు, ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. రోడ్డు కిందికి పడిపోతామోనని భయపడుతున్నారు. రోడ్డు కొట్టుకుపోయి బలహీనంగా మారింది. కొన్నిసార్లు వాహనాలు దిగబడ్డ సందర్భాలూ ఉన్నారు. త్రుటిలో ప్రమాదాలు తప్పాయి. బైక్ రైడర్లు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు వద్ద బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పరువు హత్యలు దారుణం

● మంద కృష్ణ మాదిగ



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

షాద్‌నగర్ రూరల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో పరువు హత్యలు జరగడం దారుణమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆందోళన వ్యక్తం చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లిలో హత్యకు గురైన ఎర్ర రాజశేఖర్ కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించారు. యాదవులు పూజించే శ్రీకృష్ణుడు మాదిగ జాతికి చెందిన జాంబవంతుడి కూతురును వివాహం చేసుకున్నట్లు గుర్తు చేశారు. ఆయనకు లేని కులం ఆయనను పూజించే యాదవులకు ఎందుకని ప్రశ్నించారు. హత్య జరిగిన తరువాత నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపిన పోలీసులు నిందితులకు బెయిల్ రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ స్పందించి రాజశేఖర్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కోటి రూపాయల పరిహారం ఇవ్వాలన్నారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మృతుడి కుటుంబానికి ప్రభుత్వ సాయం అందించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటన్నోళ్ల నర్సింహ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, జాంగారి రవి, దర్శన్, జంగయ్య, డి.రవి పాల్గొన్నారు.

సుదర్శన హోమానికి భారీగా ఏర్పాట్లు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, అంజనేయులు, వెంకటేశ్

కడ్తాల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కడ్తాలలోని భూ నీలసమేత లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో డిసెంబరు 6, 7తేదీల్లో సుదర్శన హోమం, మహాకుంబాభిషేకం, పుష్పోత్సవ పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, ఆలయ చైర్మన్ పి.ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు. హోమ కార్యక్రమాల ప్రచారానికి రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదపండితుడు వెంకటేశ్వరశర్మ, శ్రీధర్, వేణుగోపాల్, సాయిరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

- ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి



ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ను ప్రారంభిస్తున్నమహేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనే లక్ష్యమని ఎమ్మెల్సీ ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, పోచారం మున్సిపాలిటీ, నారపల్లిలో సోమవారం ఆయన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో కలిసి కాప్రా ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలో 14 ఎక్సైజ్ పోలీసుస్టేషన్లను మంజూరు చేసిందన్నారు. అబ్కారీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కొత్త ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లకు స్థలాలు కేటాయించి వాటికి నూతన భవనాలను నిర్మించడానికి సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ రహిత తెలంగాణను సాధించడానికి ప్రతీఒక్కరు కృషిచేయాలని సూచించారు. మద్యం కల్తీ, మద్యం అక్రమ రవాణా నివారణకు ప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని, ఎక్సైజ్ సీఐ జూపల్లి రవి, నాయకులు ముల్లి జంగయ్యయాదవ్, బద్దం గోపాల్‌రెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి, బద్దం కుమార్, అంజిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

మేడ్చల్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీకెమెరాల పాత్ర కీలకమని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన 105 సీసీకెమెరాలను సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారని అన్నారు. అందులో సీసీ కెమెరాలు పోలీసుల దర్యాప్తునకు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ తరపున 75 కెమెరాలు, దాతల సాయంతో మరో 30 కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ కెమెరాలు రైల్వేస్టేషన్, మైసమ్మగూడ, కేవీరెడ్డి నగర్ కాలనీల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ బాలిగంగిరెడ్డి, పేట్ బషీరాబాద్ ఎస్‌హెచ్‌వో విజైవర్ధన్, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ పాల్గొన్నారు.

గోపాలస్వామి ఆలయ భూమి స్వాధీనం

పూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలోని శ్రీగోపాలస్వామి ఆలయ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని చెన్‌గోముల్ గ్రామం సర్వేనంబర్-48లో శ్రీగోపాలస్వామి ఆలయానికి చెందిన 14-21 గుంటల భూమి ఉంది. అట్టి భూమి గత కొంతకాలంగా ఉపయోగంలో లేకపోవడం, అట్టి భూమిపై కొందరి కన్నుపడింది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవ చూపి భూమిని దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకునేలా చర్యలు చేపట్టారు. ఈమేరకు సోమవారం దేవాదాయ శాఖ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అనిత, దేవాదాయ శాఖ తహసీల్దార్ హరిత, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో నరేందర్, పరిశీలకులు మోహన్‌రెడ్డిలు అట్టి భూమిని సందర్శించారు. అనంతరం ఆలయ భూమిలో దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంటుందంటూ హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పాలన అధికారి టి. సాయికృష్ణ, గ్రామస్తులు కె.సుధాకర్‌గౌడ్, యాదగిరి గౌడ్, నవీన్, బి.నర్సింహులు, మనోహర్‌గౌడ్, రాకేష్, మహేందర్, నరేందర్ పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇవ్వకపోవడం దురదృష్టకరం

వికారాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వకపోవడం దురదృష్టకరమని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని క్లబ్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ముదిరాజ్ మహాసభ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత రిజర్వేషన్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనను ప్రకటించిన నేపథ్యంలో ముదిరాజ్‌ల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రస్తుత రిజర్వేషన్స్‌కు అనుగుణంగా ముదిరాజులు ఎన్నికలకు సిద్ధమవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ముదిరాజ్లను బీసీ-డీ నుంచి బీసీ ఏ గ్రూపునకు మార్చాలన్నారు. డిసెంబరు 1వ తేదీన తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కృష్ణయ్య వర్ధంతి కార్యక్రమాన్ని గ్రామగ్రామాన మండల కేంద్రాల్లో జిల్లాకేంద్రాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించుకోవాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మాణిక్యం, రాష్ట్ర కార్యదర్శి ముకుంద నాగేశ్వర్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సావిత్రి, రాష్ట్ర నాయకులు నర్సిములు, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లక్ష్మణ్, అడ్వకేట్లు లక్ష్మణ్, యాదయ్య, శేఖర్, శరణప్ప, రామస్వామి, వర్షమోని బాబు, బిచ్చన్న, గోపాల్, లాలయ్య పాల్గొన్నారు.

మాధవన్‌జీ హాస్పిటల్‌కు అవార్డుల పంట

మహేశ్వరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మాధవన్‌జీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌కు ఏకకాలంలో నాలుగు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయని, ఇది ఆనందకరం అని మాధవన్‌జీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ పి. తరుణ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అవార్డుల రాకతో హాస్పిటల్ అందిస్తున్న వైద్య సేవలపై మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. తమ ఆస్పత్రి అందిస్తున్న వైద్య సేవలను గుర్తించిన నేషనల్ హెల్త్‌కేర్ వెల్నెస్ సంస్థ ఢిల్లీలో తమ వైద్యులకు అవార్డులు అందజేసిందని తెలిపారు. హాస్పిటల్ స్థాపించిన మొదటి ఏడాదిలోనే ఈ అవార్డుల సాధనలో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ప్రతీ ఒక్కరి కృషి ఉందని, అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. అవార్డులు అందుకున్న వారిలో డాక్టర్లు హిమబిందు, ప్రభాకర్, ఆశికారెడ్డి ఉన్నారు.

ప్రజా, విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాడాలి



ప్రసంగిస్తున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రదీప్

తాండూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘమైన పోరాట వారసత్వం విప్లవ విద్యార్థి సంఘం పీడీఎస్‌యూకే ఉందని ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రదీప్ అన్నారు. తాండూరులో పీడీఎస్‌యూ వికారాబాద్ జిల్లా 4వ మహాసభల సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. జార్జిరెడ్డి, చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోల శంకర్, రంగవల్లి లాంటి విద్యార్థి రత్నాలు త్యాగాలతో గొప్పఆశయాలతో పీడీఎస్‌యూ ఏర్పాటు జరిగిందన్నారు. పీడీఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు వి.మహేష్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రెండేళ్లుగా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడసంగి నాగరాజు, తెలంగాణ లెక్చరర్ల ఫోరం ప్రతినిధి పర్యాద రామకృష్ణ, ప్రముఖ విద్యావేత్త రంగారావు, తెలంగాణ ఉద్యమకారుడు సోమశేఖర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి రాజేష్, డివిజన్ అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

ఫామ్‌హౌస్‌పై పోలీసుల దాడి

- పేకాట ఆడుతున్న 13 మంది అరెస్టు
- నగదు, మొబైల్స్ స్వాధీనం

కేశంపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఫామ్ హౌస్‌పై ఎస్ఓటీ, కేశంపేట పోలీసులు సంయుక్తంగా దాడిచేసి పేకాట ఆడుతున్న 13మందిని అదుపులోకి తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం బైర్‌ఖాన్‌పల్లి, ఖాన్‌పల్లి శివారుల్లోని నిర్మల ఫామ్నిర్మల ఫామ్ హౌస్‌లో సోమవారం పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సీఐ నర హరి నేతృత్వంలో దాడిచేశారు. జూదం జరుగుతున్న 13మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు పరారైనట్టు సీఐ తెలిపారు. 2.67లక్షల రూపాయలు, 14 మొబైల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



మేడ్చల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆమె పాల్గొని అర్జీలను స్వీకరించి సంబంధితశాఖల అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన వినతులపై చర్యలు చేపట్టి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన వినతులను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. అదేవిధంగా సీఎంవో ప్రజావాణి కేసులను సైతం పరిష్కరించాలన్నారు. 126 ప్రజావాణి కార్యక్రమంలో 126అర్జీలు అందినట్లు అడిషనల్ కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ పాల్గొన్నారు.

అదుపుతప్పిన బైక్.. ఇద్దరు యువకులు దుర్మరణం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. కాగా, సోమవారం ఉదయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన కమల్ టమాట(20), దామర్ టమాట(18)లు ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో ఉంటూ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో బోగారంలోని బంధువుల ఇంటికి యాక్టివా బైక్‌పై బయలుదేరారు. కొండాపూర్ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అర్ధ రాత్రి కావడంతో ఎవరూ గుర్తించలేదు. సోమవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతివేగం కారణంగానే ఇద్దరు యువకులు మృతి చెందారని పోలీసులు భావిస్తున్నారు. సోమవారం మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



మృతదేహాన్ని తరలిస్తున్న స్థానికులు

మోడల్‌గా కొడంగల్

(ఐదో పేజీ తరువాయి)

చదువులు ఒకేచోట అందుబాటులో ఉండే విధంగా కొడంగల్‌ను ఎడ్యుకేషన్ క్యాంపస్‌గా తీర్చిదిద్దుతామన్నారు.

ఉపాధి అవకాశాలు పెంచుతాం

కొడంగల్ - నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంతో మరో మూడు సంవత్సరాల్లో కొడంగల్ ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకువచ్చి సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. కొడంగల్ మండలంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంపొందిస్తామన్నారు. వికారాబాద్ - కృష్ణా రైల్వేలైన్ ఏర్పాటుతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధిలో ముందుకు సాగేలా చేస్తామన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు నాణ్యమైన చీరలను అందిస్తూ మహిళల ఆత్మగౌరవం పెరిగేలా చేస్తున్నామని తెలిపారు. పెట్రోల్ బంక్‌లు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, బస్సుల నిర్వహణతో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఒక్క విద్యార్థి కూడా ఆకలితో బాధపడకూదని అక్షయపాత్ర సహకారంతో



కిచెన్ షెడ్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం, పక్కన కలెక్టర్‌ప్రతీక్ జైన్, మంత్రులు, ఎమ్మెల్యేలు

నియోజకవర్గంలో 312 పాఠశాలల్లో 28 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందిస్తున్నామన్నారు. అలాగే మధ్యాహ్నం విద్యార్థులకు భోజన పథకం కూడా అమలు చేసేందుకు అక్షయ పాత్ర ఫౌండేషన్ నిర్వాహకులు ప్రభుసత్యదాత చంద్రతో కలిసి గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ నిర్మాణం పనులకు భూమి పూజ చేశామని సీఎం తెలిపారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం రూ.103 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.583 లక్షలు, 23 పాఠశాలల్లో అదనపు తరగతి గదులకు రూ.501 లక్షలు, 10 పంచాయతీ భవనాలకు రూ.300లక్షలు, బంజార భవన్‌కు ప్రహరీ, డైనింగ్ హాల్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కోసం రూ.365 లక్షలు, ఫైర్ స్టేషన్‌కు రూ.130 లక్షలు, కొడంగల్‌లో స్విమ్మింగ్ పూల్‌కు రూ.140 లక్షలు, కమ్యూనిటీ హాల్, కిచెన్ షెడ్డు, ప్రహరీ నిర్మాణానికి రూ.491 లక్షలు, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.445 లక్షలు, అలాగే రూ.295 లక్షలతో నిర్మించిన తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవం చేశారు. కొడంగల్‌లో రోడ్డు విస్తరణ పనులకు రూ.60కోట్లు, రూ.500 లక్షలతో ఆర్ అండ్‌బీ అతిథి గృహం, కోస్గి నూతన మార్కెట్ యార్డు నిర్మాణానికి రూ.450 లక్షల విలువ గల పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.

అల్పాహారం కిచెన్ షెడ్డు పరిశీలన

కొడంగల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో హరే కృష్ణ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్పాహారం తయారీ కిచెన్ షెడ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో నేరుగా కొడంగల్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి మొదట అల్పాహారం తయారీ షెడ్‌ను పరిశీలించారు. కిచెన్ షెడ్‌లో అత్యాధునిక యంత్రాలతో వంటలు చేసే విధానాన్ని ఫౌండేషన్ నిర్వాహకులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన అల్పాహారం తయారు చేసే యంత్రాన్ని స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.

పెల్లుబికిన ఉత్సాహం

బొంరాస్‌పేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఎన్కెపల్లి గేటు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డిని చూసేందుకు ఆయన అభిమానులు పోలీసులను సైతం నెట్టుకుంటూ ముందుకు వెళ్లారు. మధ్యాహ్నం కొడంగల్‌కు హెలికాప్టర్‌లో చేరుకున్న సీఎం రోడ్డు మార్గంలో సభా స్థలానికి చేరుకున్నారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎన్కెపల్లి రోడ్డు వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుకిరువైపులా నినాదాలు చేస్తూ ఉత్సాహం నింపారు. కాగా, బహిరంగ సభ ప్రాంగణం వద్ద చిరు వ్యాపారులు పెద్ద సంఖ్యలో కనిపించారు.



మంత్రికి మొక్కను అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, సిబ్బంది

మెడికల్ కళాశాల నిర్వహణపై ఆరా


- కొడంగల్‌కు తరలిస్తామని మంత్రి హామీ

తాండూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తాండూరులో నిర్వహిస్తున్న కొడంగల్ మెడికల్ కళాశాల నిర్వహణ గురించి వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజును అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కొడంగల్‌కు వచ్చిన మంత్రిని ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థులు అందుతున్న సౌకర్యాలు, అవసరమైన పరికరాలపై మంత్రికి వివరించారు. త్వరలో కొడంగల్‌లో ఏర్పాటు చేస్తున్న 440 బెడ్ల ఆస్పత్రితో పాటు మెడికల్ కళాశాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో పేదలకు సొంతిళ్లు

షాబాద్/ చేవెళ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క ఇల్లయినా కట్టివ్వలేదని, కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తూ పేదల్లో ఆనందాన్ని నింపుతున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం షాబాద్ మండలం ఏట్లఎర్రవల్లిలో నరాల కవిత నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గుడి చంద్రశేఖర్‌లతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అపర్ణ, చేవెళ్ల ఏఎంసీ ఛైర్మన్ పెంటయ్యగౌడ్, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌గౌడ్, రవీందర్‌నాయక్, మధుసూదన్‌గుప్తా, ప్రభాకర్‌రెడ్డి, ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, సూర్యగౌడ్, మహేశ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే చేవెళ్ల మునిసిపల్ పరిధి రామన్నగూడలో పోతిరెడ్డి అనిత-వీరేశం దంపతుల ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే యాదయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లావణ్య-శంకర్, డి.వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెంటయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఫౌంటేన్ కాదు.. భగీరథ పైప్‌లైన్



యాలాల మండలం లక్ష్మీ నారాయణపూర్ - బషీరాబాద్ మార్గంలో జుంటు వాగు వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ జాయింట్ విడిపోయి పైప్‌లైన్ నుంచి నీరు ఉవ్వెత్తున ఆకాశానికి ఎగిసిపడింది. దీంతో మార్గంలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు గంట పాటు ఆ మార్గంలో ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న మిషన్ భగీరథ అధికారులు నీటి సరఫరాను నిలిపివేయడంతో నీటి ఉధృతి తగ్గింది. అనంతరం వారు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు.

- యాలాల, నవంబరు24, (ఆంధ్రజ్యోతి)

జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జామ్

బ్రిడ్జి పనుల కారణంగా సర్వీసు రోడ్డు మీదుగా వాహనాల తరలింపు

- డీజిల్ ట్యాంకర్ చెడిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం
- ఐదు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

ఘట్‌కేసర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక ఔటర్ జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో వాహనాలను జాతీయ రహదారి సర్వీసురోడ్ల మీదుగా మళ్లించారు. స్థానిక ఎదిమల్లె వాగు సమీపం నుంచి ఔటర్ బ్రిడ్జి వరకు వాహనాలను రెండు వైపులా సర్వీసు రోడ్లపై నుంచి వెళ్లేవిధంగా చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం హెచ్‌పీసీఎల్ వైపు నుంచి నగరం వైపు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ చెడిపోయింది. ఇంకేముంది అసలే సాయంత్రం సమయం కళాశాల విద్యార్థులు, వివిధ పనులపై వెళ్లిన వారు, ఉద్యోగాలు ముగించుకొని ఇళ్లకు(నగరానికి) చేరే సమయం కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది, దీనికితోడు బ్రిడ్జిపనుల కారణంగా ప్రధానరోడ్డును మూసివేసి సర్వీసు రోడ్లపై నుంచి వాహనాలను మళ్లించారు. దీంతో నిమిషాల వ్యవధిలో ట్రాఫిక్ జామ్ అయింది. ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు చెడిపోయిన ట్యాంకర్‌ను గంటకు పైగా శ్రమించి అతికష్టం మీద పక్కకు తియించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



ఘట్‌కేసర్‌లోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

మహిళలకు వడ్డీలేని రుణాలు

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మేడ్చల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహిళలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ నేటి (మంగళవారం) నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు వడ్డీలేని రుణాలు పంపిణీని ఒకేసారి నిర్వహిస్తామని తెలిపారు. మండల, గ్రామ సమాఖ్యల నాయకులు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో జరుగుతున్న వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు. గత ప్రభుత్వం వడ్డీలేని రుణాల కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. కానీ ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే దానిని పెద్దఎత్తున పునరుద్ధరించిందన్నారు. ఈ చొరవ రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని తెచ్చిపెట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇప్పటికే రెండు, మూడు దశల్లో వడ్డీలేని రుణాలు పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. కలెక్టర్లు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారని డిప్యూటీ సీఎం ప్రశంసలు గురిపించారు. మహిళలకు నాణ్యమైన చీరలు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. రుణాల పంపిణీకి తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్‌డీవో సాంబశివరావు, హౌజింగ్ పీడీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

బీసీలకు ఒక్క సర్పంచ్ స్థానమైనా ఇవ్వరా?

- భగ్గుమన్న బీజేపీ నాయకులు
- ఆమనగల్లులో రహదారిపై ధర్నా

ఆమనగల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలంలో ఒక్క సర్పంచ్ స్థానాన్నీ బీసీలకు కేటాయించలేదని బీజేపీ నాయకులు భగ్గుమన్నారు. సోమవారం నిరసన చేపట్టారు. పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్షులు ఎర్రవోలు శ్రీను, కర్నాటి విక్రమ్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సీఎం రేవంత్‌దిష్టి బొమ్మను దహనం చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, బీజేవైఎం పార్లమెంట్ కన్వీనర్ రవిరాథోడ్, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ పద్మప్రశాంత్‌లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసగించిందన్నారు. మండలంలో 13 పంచాయతీలుంటే ఒక్కటైనా బీసీలకు కేటాయించలేదెందుకని ప్రశ్నించారు. బీసీలను ఈ సర్కార్ చేసిన నయవంచనకు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ సింగ్, చెన్నకేశవులు, శ్రీధర్, శ్రీను, జగన్‌రెడ్డి, ఆనంద్, జి.శ్రీను, బుచ్చయ్య, రాఘవ, జంగయ్య, వెంకటయ్య, రామస్వామి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

రాజశేఖర్ హత్య పాశవికం

షాద్‌నగర్ రూరల్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : ఎర్ర రాజశేఖర్ హత్య పాశవికం అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎల్లంపల్లి వచ్చిన ఆయన మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే హత్య జరిగిందని, అందువల్ల అందుకు బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలన్నారు. మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. కులాంతర వివాహంపై షాద్‌నగర్, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్లలో పంచాయితీలు జరిగాయన్నారు. రాజశేఖర్‌ను పథకం ప్రకారమే చంపారన్నారు. పోలీసుల అండతోనే రాజశేఖర్, చంద్రశేఖర్‌లపై దాడి చేశారని ఆరోపించారు. రాజశేఖర్‌ను లాక్కెళ్తున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చినా వారు సకాలంలో స్పందించ లేదని విమర్శించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి నిందితులకు త్వరగా శిక్ష పడేలా చేయాలన్నారు. ఆయనతో ఎమ్మార్పీఎస్ నాయకులు పి.నర్సింలు, దర్శన్, పెంటయ్య, జంగయ్య ఉన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక


క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

కులకచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 69వ జాతీయ స్థాయి మల్లఖంబ్ క్రీడలకు కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి మల్లఖంబ్ క్రీడల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు కీర్తన అండర్-14 విభాగంలో, మహేశ్, అఖిల్, భరత్ అండర్-17 విభాగంలో, హనుమంతు అండర్-19 విభాగంలో జరిగిన క్రీడల్లో పాల్గొని జాతీయస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈనెల 25 నుంచి 29 వరకు మధ్యప్రదేశ్ ఉజ్జయినిలో జరిగే జాతీయస్థాయి క్రీడల్లో విద్యార్థులు పాల్గొననున్నారు. సోమవారం విద్యార్థులు బయలుదేరి వెళ్లారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, పీడీ సుభాష్ అభినందించారు.

విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలి

దోమ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు అర్థమయ్యే విధంగా బోధించాలని ఎంఈవో వెంకట్ అన్నారు. సోమవారం మండలంలోని బుద్లాపూర్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఎఫ్ఎల్ఎస్‌లో భాగంగా మూడవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భీమ్లానాయక్, మధు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

తాండూరు: ఇందిరమ్మ చీరలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి →




మోమిన్‌పేట్: మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో

మోమిన్‌పేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో సృజన సాహిత్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్ యాదవ్‌తో కలిసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో యాదగిరి, ఏపీయం రాజు, మహిళాసమాఖ్య సభ్యులు భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు సుగుణ, నర్సిములు, మాధవి, రాణి, స్వప్న, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండూరు: తాండూరులో ఎన్నికల కోడ్ రాక ముందే చీరల పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలో గ్రామీణ డ్వాక్రా మహిళలకు లక్షా 37వేల 497 చీరలను పంపిణీ చేసేందుకు ఆయా గ్రామాలకు చీరలను పంపించామని డీపీఎం శేఖర్ తెలిపారు. ఇప్పటి వరకు 70శాతం మేరకు చీరల పంపిణీ ప్రక్రియను పూర్తిచేశారు. చీరలు తమకు కూడా కావాలని డ్వాక్రా సంఘంలో లేని మహిళలు కోరుతుండటంతో డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశాక తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే తాండూరులోని ఇందిరా మహిళశక్తి పథకం కింద మెప్మా పరిధిలోకి వచ్చే మహిళలకు మార్చి నాటికి ఇందిరమ్మ చీరల పంపిణీ చేయనున్నట్లు జిల్లా మెప్మా పీడీ రవికుమార్ తెలిపారు.

చౌడాపూర్: మక్తవెంకటాపూర్, మందిపాల్, లింగంపల్లి, చౌడాపూర్ గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ మండల నాయకులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సోమలింగం, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, యాదమ్మ, వెంకట్, సలీమ్ పాల్గొన్నారు.

యాలాల: మండల కేంద్రంలో సోమవారం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో ఈ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, కో-ఆప్షన్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా తదితరులు మహిళలకు చీరలు అందజేశారు.

కులకచర్ల: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, డీసీసీబీ డైరెక్టర్, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. సోమవారం కులకచర్ల, తిరుమలాపూర్, ఇప్పయిపల్లి, కుసుమ సముద్రం గ్రామాల్లో ఇందిరమ్మ చీరలను డీసీసీ ఉపాధ్యక్షుడు భేదంరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఏపీయం శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

చౌడాపూర్: మండలంలోని మక్తవెంకటాపూర్, మందిపాల్, లింగంపల్లి, చౌడాపూర్ గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ మండల నాయకులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సోమలింగం, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నాగరాజు, మహిళాసమాఖ్య మండల అధ్యక్షురాలు యాదమ్మ, వెంకట్, సలీమ్, రాము, చిన్నయ్య, కృష్ణయ్య, నవీన్ పాల్గొన్నారు.

దోమ: మండలంలోని లింగన్‌పల్లి, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లో ఇందిర మహిళా శక్తి ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్, నర్సిములు, వెంకటయ్య, బాబర్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు

పరిగి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 32 గ్రామపంచాయతీల్లో రిజర్వేషన్‌ల వివరాలు అధికారులు ప్రకటించారు. ఎస్టీలకు ఆరు, ఎస్సీలకు ఏడు, బీసీలకు ఐదు, జనరల్ కేటగిరికి 14స్థానాలు కేటాయించారు. బర్కత్‌పల్లి(జనరల్, మహిళ), బసిరెడ్డిపల్లి(జనరల్ మహిళ), చిగురాల్‌పల్లి(జనరల్, మహిళ), చిట్యాల్(ఎస్సీ జనరల్), గడిసింగాపూర్(ఎస్సీ, మహిళ), గోవిందాపూర్(ఎస్టీ జనరల్), హిర్యానాయక్ తండా (ఎస్టీమహిళ), ఇబ్రహింపూర్ (ఎస్సీ, జనరల్), జాఫర్‌పల్లి(జనరల్), కాళ్యాపూర్(జనరల్), ఖుదావంద్‌పూర్(ఎస్సీ, జనరల్), లక్నాపూర్(జనరల్), లక్ష్మీదేవిపల్లి (జనరల్), మాదారం(బీసీ, జనరల్), మల్కాయపేట్‌తండా (ఎస్టీ, జనరల్), మిట్టకోడూరు(జనరల్), నారాయణపూర్(జనరల్), నర్సయాగూడ(బీసీ,జనరల్), పేటమాదారం(జనరల్), పొల్కంపల్లి(బీసీ, మహిళ), రాఘవాపూర్(ఎస్సీ, మహిళ), రంగంపల్లి(బీసీ, జనరల్), రంగాపూర్(జనరల్,మహిళ), రాపోల్(ఎస్సీ, మహిళ), రావులపల్లి(జనరల్), రూప్‌సింగ్‌తాండ(ఎస్టీ, మహిళ), సాలిప్పలిబాటతాండ(ఎస్టీ, మహిళ), సోండేపూర్(ఎస్టీ, జనరల్), సయ్యద్‌పల్లి(బీసీ, మహిళ), తొండపల్లి(ఎస్సీ, జనరల్), యాభాజీగూడ(జనరల్, మహిళ)కు కేటాయించారు.

పూడూరు: పంచాయతీల ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం రంగంసిద్ధం చేసింది. సర్పంచ్‌లు, వార్డులకు రిజర్వేషన్ల నిర్ధారణ ప్రక్రియ పూర్తిచేసింది. ఈ మేరకు పూడూరు మండలంలోని 32 పంచాయతీలు, 282 వార్డులకు గానూ ప్రభుత్వం రిజర్వేషన్లను ప్రకటించింది. మండలంలో 32పంచాయతీలకు గానూ ఎస్సీలు 8, ఎస్టీ-1, బీసీ-7, జనరల్-16, మహిళలకు 15 రిజర్వేషన్ ఖరారు చేసింది. పూడూరు మండల పరిధిలోని అంగడిచిట్టెంపల్లి పంచాయతీకి సర్పంచ్ స్థానానికి అన్‌రిజర్వ్(జనరల్), బాకాగాపూర్-జనరల్-అన్‌రిజర్వ్ మహిళ, చీలాపూర్-ఎస్సీ(మహిళ), చెన్‌గోముల్-అన్‌రిజర్వ్(జనరల్), చింతలపల్లి -ఎస్సీ(మహిళ), దేవనోనిగూడ-అన్‌రిజర్వ్ మహిళ, గట్టుపల్లి-అన్‌రిజర్వ్ (జనరల్), గొరుగుపల్లి-ఎస్సీ(జనరల్), కడుమూరు-ఎస్సీ (జనరల్), కండ్లపల్లి-ఎస్సీ (మహిళ), కంకల్-ఎస్సీ(జనరల్), కెరవెళ్లి-అన్‌రిజర్వ్(జనరల్), కొత్తపల్లి-అన్‌రిజర్వ్(మహిళ), మంచన్‌పల్లి-బీసీ(జనరల్), మన్నెగూడ-బీసీ(మహిళ), మేడికొండ-బీసీ(మహిళ), మేడిపల్లికలాన్-బీసీ(మహిళ), మిర్జాపూర్-అన్‌రిజర్వ్(మహిళ), మిట్టకంకల్-బీసీ(జనరల్), నిజాంపేట్ మేడిపల్లి-అన్‌రిజర్వ్(జనరల్), పెద్దఉమ్మెంతల్-ఎస్సీ(మహిళ), పుడుగుర్తి-బీసీ(జనరల్), పూడూరు-బీసీ(జనరల్), కుత్బుల్లాపూర్-అన్‌రిజర్వ్(మహిళ), రాకంచర్ల-ఎస్టీ(జనరల్), రేగడిమామిడిపల్లి-అన్‌రిజర్వ్‌డ్(జనరల్), సిరిగాయిపల్లి-అన్‌రిజర్వ్(జనరల్), సోమన్‌గుర్తి-ఎస్సీ(జనరల్), తిమ్మాపూర్-అన్‌రిజర్వ్(మహిళ), తిరుమలాపూర్-అన్‌రిజర్వ్(మహిళ), తుర్కఎన్కెపల్లి-అన్‌రిజర్వ్-(మహిళ), ఎన్కెపల్లి-అన్‌రిజర్వ్(జనరల్) కేటాయించారు.

దుద్యాల్: నూతనంగా ఏర్పడిన దుద్యాల్ మండలంలో పంచాయతీ రిజర్వేషన్‌లు ఖరారయ్యాయి. రోటిబండ, సత్తర్‌కుంట, వాల్యానాయక్ తండాలు (ఎస్టీ మహిళ), చెట్టుపల్లి, ఎక్క చెరువు, సాగారం, సంత్రకుంట తండాలు (ఎస్టీ జనరల్), హంసన్‌పల్లి, దుద్యాల్, గౌరారం గ్రామాలు (జనరల్, మహిళ), ఈర్లపల్లి, పోలెపల్లి, అల్లిఖాన్‌పల్లి గ్రామాలు జనరల్, లగచర్ల, కుదురుమళ్ల గ్రామాలు (బీసీ జనరల్), నాజ్‌ఖాన్‌పల్లి (ఎస్సీ మహిళ), చిలుముల్‌మైలారం (ఎస్సీ జనరల్), హకీంపేట్, ఆలేడ్ గ్రామాలు (బీసీ మహిళలు)గా ఖరారయ్యాయి. వీటితో పాటు ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని 166 వార్డులకు సంబంధించిన రిజర్వేషన్‌లు కూడా ఖరారయ్యాయి.

కులకచర్ల/దోమ: కులకచర్ల మండలంలోని 33 గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్‌లు ఖరారయ్యాయి. అనంతసాగర్ ఎస్టీ, ఘనపూర్ ఎస్టీ, రాంనగర్ ఎస్టీ మహిళ, బిందెమ్‌గడ్డ తండా ఎస్టీ మహిళ, దాస్యానాయక్ తండా ఎస్టీ మహిళ, దీప్లానాయక్ తండా ఎస్టీ మహిళ, బోటియనాయక్ తండా ఎస్టీ, చెరువు ముందల తండా (ఏ) ఎస్టీ, చెరువు ముందు తండా(కే) ఎస్టీ మహిళ, ఎత్తుకాల్వ తండా ఎస్టీ, హన్మానాయక్ తండా ఎస్టీమహిళ, పటేల్ చెరువు తండా ఎస్టీ మహిళ, ఎర్రగోవింద్ తండా ఎస్టీ, గోరిగడ్డ ఎస్టీ, ఇప్పయిపల్లి ఎస్సీ, పీరంపల్లి ఎస్సీ, సాల్విడ్ ఎస్సీ, చెల్లాపూర్ బీసీ మహిళ, కులకచర్ల బీసీ, కామున్‌పల్లి బీసీ మహిళ, ముజాహిద్‌పూర్ బీసీ, బండవెల్కిచర్ల బీసీ, అల్లాపూర్ జనరల్ మహిళ, రాంపూర్ జనరల్, కుసుమ సముద్రం జనరల్, అంతారం జనరల్ మహిళ, పుట్టపహడ్ జనరల్, బండమీదితండా జనరల్ మహిళ, లాల్‌సింగ్ తండా జనరల్, రామ్‌రెడ్డిపల్లి జనరల్, చాపలగూడెం జనరల్ మహిళ, తిరుమలాపూర్ జనరల్ మహిళ, బొమ్మిరెడ్డిపల్లి జనరల్ మహిళకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. అదేవిధంగా దోమ మండలంలోని 36గ్రామపంచాయతీలకు బీసీ జనరల్ అయినాపూర్, దిర్సంపల్లి, లింగన్‌పల్లి, బీసీ మహిళ బొంపల్లి, బ్రహ్మణపల్లి, గూడూరు, ఎస్సీ జనరల్ కిష్టాపూర్, బుద్లాపూర్, తిమ్మాయిపల్లి, ఎస్సీ మహిళా పోతిరెడ్డిపల్లి, పాలెపల్లి, కొండాయపల్లి, ఎస్టీ జనరల్ బడెంపల్లి, గోన్యానాయక్ తండా, గుండాల్, పలుగుతండా, పెద్దతండా, చిన్నతండా, ఎస్టీ మహిళ దిర్సంపల్లి తండా, గంజిపల్లి, గొట్ల చెలకతండా, పెద్ద తండా, (బొంపల్లి) అన్ రిజర్వుడ్ జనరల్ బాసుపల్లి, దోమ, దోర్నాల్‌పల్లి, గోడుగోనిపల్లి, ఖమ్మంనాచారం, ఊటుపల్లి, మోత్కుర్, రాకొండ అన్ రిజర్వుడ్ మహిళ, బట్ల చందారం, దాదాపూర్, దొంగ ఎన్కెపల్లి, కొత్తపల్లి, మైలారం మల్లెపల్లి, శివారెడ్డిపల్లి గ్రామాల వారీగా రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

ఇందిరమ్మ రాజ్యంలో సొంతింటి కల సాకారం


చైతన్యనగర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దేముల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో చెంచుకుటుంబాల సొంతింటి కళను నెరవేరుస్తున్నామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం చైతన్యనగర్ గ్రామంలో ఇందిరమ్మ మోడల్‌కాలనీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి చెంచుకుటుంబానికి అన్ని వసతులతో పక్కాఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. చెంచుకుటుంబాలకు మొదటి విడతగా 177 ఇండ్లు వచ్చాయని అన్నారు. చైతన్యనగర్‌కు 163, బషీరాబాద్ మండలంలోని నీళ్లపల్లి గ్రామానికి 14 ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మహిపాల్‌రెడ్డి, కోహీర్‌రవిశంకర్ పాల్గొన్నారు.

‘రేవంత్‌రెడ్డిది నిరంకుశ పాలన’

వికారాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరంకుశంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ అన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో భాగంగా పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టులను చేపట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

అందెశ్రీకి ఘన నివాళి

కులకచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) బండవెల్కిచర్లలో డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ గీత రచయిత అందెశ్రీకి సోమవారం నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, కార్యదర్శి జహంగీర్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

తాండూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వీరశెట్టిపల్లి గ్రామంలో లయన్స్‌క్లబ్(పీడీజీ) రమేశ్ చంద్రపండిత్ జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ తాండూరు అధ్యక్షుడు లయన్ శరణబసప్ప, కోశాధికారి లయన్ బి.గౌరిశంకర్, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఎడ్రామి బసనప్ప, వివేక్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీడే వీరభద్రప్ప, మాజీసర్పంచ్ బీడే నాగప్ప, యువ జాగృతి అధ్యక్షుడు మర్యాద రామకృష్ణ, గ్రామ కార్యదర్శి నజీర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

తపస్ వికారాబాద్ మండల అధ్యక్షుడిగా సంతోష్ కుమార్



వికారాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం వికారాబాద్ మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, సురేందర్‌రెడ్డిలు నియామకమయ్యారు. పట్టణంలోని తపస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎన్నికల అధికారి చంద్రమౌళి సమక్షంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అనంతరెడ్డి, ముత్యంరెడ్డి, కమల్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్, సంగమేశ్వర్, రాఘవేందర్‌గుప్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అతిథి గృహానికి మోక్షం

- నిధులు మంజూరైన 8ఏళ్లకు పనులు ప్రారంభం


తాండూరులో ఇరిగేషన్ అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తాండూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాండూరు నడి బొడ్డులో ఉన్న నీటి పారుదల శాఖ అతిథి గృహానికి కొన్నేళ్ల చరిత్ర ఉంది. తాండూరుకు వచ్చిన ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులకు అతిథ్యం ఇచ్చిన అతిథి గృహం శిథిలావస్థకు చేరడంతో అధ్వాన్నస్థితికి చేరుకుంది. అతిథులకు అతిథ్యం ఇచ్చే అతిథి గృహం లేదనే ఉద్దేశ్యంతో పాలకులు, అధికారులు 8ఏళ్ల క్రితం ఈ అతిథి గృహాన్ని పునర్నిర్మించేందుకు రూ.కోటి కేటాయించారు. పనులు సాగుతుండగానే కాంట్రాక్టర్ ఆకస్మాత్తుగా మృతి చెందడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో గతేడాది కాలంగా తిరిగి అతిథి గృహాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరిగాయి. అప్పటికే 60శాతం పనులు పూర్తి కావంతో మిగిలిన 40శాతం పనులు పూర్తిచేసి అందుబాటులో తెచ్చేందుకు మహిళా కాంట్రాక్టర్ శోభారాణికి పనులు అప్పగించారు. సోమవారం ఇరిగేషన్ అధికారులు అతిథి గృహంలో అవసరమైన పనులను ముఖ్యంగా విద్యుత్, శానిటేషన్, ఫెన్సింగ్ వంటి పనులను వెంటనే చేపట్టేందుకు అంచనాలు వేశారు. 8ఏళ్లుగా ఈ అతిథి గృహంలో మత్తుపదార్థాలు సేవించే వారికి అడ్డాగా మారింది. అధికారులు అప్పట్లో స్పందించి అందులోకి ఎవరినీ వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. ఆరు మాసాల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

కులకచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరి మద్దతు కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి అన్నారు. బండవెల్కిచర్ల గ్రామంలో సోమవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో బక్కారెడ్డి, పాంబండ ఆలయ మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

18.01 శాతమే

(ఐదో పేజీ తరువాయి)

ప్రకటించారు. ఎస్సీలకు 111 సర్పంచ్ స్థానాలను రిజర్వు చేయగా, వాటిలో 51 మహిళలకు, 60 అన్ రిజర్వుడ్‌కు కేటాయించారు. బీసీలకు మొత్తం 107 సర్పంచ్ స్థానాలను కేటయించగా, వాటిలో 49 మహిళలకు, 58 అన్ రిజర్వుడ్‌కు రిజర్వు చేశారు. అన్ రిజర్వుడ్ కేటగిరికి 257 సర్పంచ్ స్థానాలను రిజర్వు చేయగా, వాటిలో 124 మహిళలకు, 133 అన్ రిజర్వుడ్‌కు కేటాయించారు.

మహిళలకు 2,436 వార్డులు

జిల్లాలో 5,058 వార్డులు ఉండగా, వాటిలో 2,436 మహిళలకు రిజర్వు చేయగా, 2,622 అన్ రిజర్వుడ్‌కు కేటాయించారు. వంద శాతం ఎస్టీ జనాభా కలిగిన పంచాయతీల్లో 680 వార్డులను ఎస్టీలకే రిజర్వు చేయగా, వాటిలో 340 మహిళలకు, 340 అన్ రిజర్వుడ్‌కు కేటాయించారు. ఎస్టీలకు 239 వార్డులు కేటాయించగా, వాటిలో 113 మహిళలకు, 126 అన్ రిజర్వుడ్‌కు రిజర్వు చేశారు. ఎస్సీలకు 945 వార్డులను రిజర్వు చేయగా, వాటిలో 445 మహిళలకు, 500 వార్డులను అన్ రిజర్వుడ్‌కు కేటాయించారు. బీసీలకు మొత్తం 995 వార్డులను కేటయించగా, వాటిలో 458 మహిళలకు, 537 అన్ రిజర్వుడ్‌కు రిజర్వు చేశారు. అన్ రిజర్వుడ్ కేటగిరికి 2199 వార్డులను రిజర్వు చేయగా, వాటిలో 1080 మహిళలకు, 1,119 అన్ రిజర్వుడ్‌కు కేటాయించారు.

డెడికేటెడ్ కమిషన్ ఆధారంగా..


బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు బీసీ రిజర్వేషన్లలో భారీగా కోత పడింది. 2019 సంవత్సరంలో జిల్లాలో 565 పంచాయతీలకు ఎన్నికలు జరిగితే అప్పట్లో బీసీలకు 126 సర్పంచ్ స్థానాలను రిజర్వు చేయగా, ఆదివారం ఖరారు చేసిన రిజర్వేషన్లలో బీసీలకు కేవలం 107 సర్పంచ్ స్థానాలు మాత్రమే దక్కాయి. గత ఎన్నికలతో పోలిస్తే బీసీలకు 19 సర్పంచ్ స్థానాలు తగ్గిపోయాయి. 2013లో జరిగిన ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయగా, 2019లో జరిగిన ఎన్నికల్లో బీసీలకు 22.78 శాతం మాత్రమే రిజర్వేషన్లు దక్కాయి. రొటేషన్ విధానంతో ఈసారి జిల్లాలో బీసీలకు 18.01 శాతం మాత్రమే సర్పంచ్ స్థానాల్లో రిజర్వేషన్ల కేటాయింపు జరిగింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విషయం ఎంత వరకు అమలుకు నోచుకోనుందనేది దేవుడెరుగు ... గానీ పాత రిజర్వేషన్ పద్ధతిలో అమలు చేయడం, రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు చేయడంతో బీసీ స్థానాలకు భారీగా కోత పడింది.

అనాథలైన పిల్లలకు భరోసా


తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను పరామర్శిస్తున్న మాతా మెడికల్ జనరల్ స్టోర్ రవి, డాక్టర్ భాస్కర్

యాలాల, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు స్థానికులు భరోసానిస్తున్నారు. వారి చదువుకు ఏటా అయ్యే ఖర్చును తాము భరిస్తామని శంకర్‌పల్లిలోని మాతా మెడికల్ జనరల్ స్టోర్ రవి, డాక్టర్ భాస్కర్‌లు ముందుకొచ్చారు. ఈ మేరకు సోమవారం వారు యాలాల మండల హాజీపూర్ గ్రామానికి చెందిన తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను కలిసి పరామర్శించారు. ఇద్దరు పిల్లల పేరిట లక్ష్మీనారాయణపూర్‌లోని బ్యాంకులో జాయింట్ ఖాతా తెరిపించారు. రూ.25వేలు అందజేశారు. ఏటా విద్యార్థుల చదువుకు అయ్యే ఖర్చును తాము భరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పాండురంగం, అనంతయ్య, జంగయ్య తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ


శిక్షణలో ఉపాధ్యాయులు

పూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగూడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పునాది స్థాయి నైపుణ్యాలను, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు శిక్షణ ఎంతగానో ఉపయోపడుతుందని సూచించారు. పూడూరు ఎంఈవో సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎస్ కార్యచరణ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణా ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ కాశీనాథ్, సీనియర్ మెంటర్ తుల్జప్ప, సీఆర్పీ గాలయ్య, జెడ్పీహెచ్ఎస్ మన్నెగూడ ప్రధానోపాధ్యాయులు నర్సింహులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

కులకచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని వైద్యాధికారి కిరణ్‌కుమార్ గౌడ్ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సోమవారం 30మంది గర్భిణీ మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రతీ సోమ, శుక్రవారాల్లో గర్భిణి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా రక్త పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి


రాములమ్మ(ఫైల్)

పూడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన పూడూరు మండలంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి చెన్‌గోముల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని చెన్‌గోముల్ గ్రామానికి చెందిన బేగరి రాములమ్మ(80) అదృశ్యమైంది. దీంతో వృద్ధురాలి కుమారుడు బేగరి నర్సింహులు ఈనెల 21వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని జలీల్‌మియాకు చెందిన పాడుబడిన ఇంట్లో నుంచి కుళ్లిన వాసన వస్తుండటంతో పక్కింటి వారు గమనించి అనుమానంతో బేగరి నర్సింహులుకు సమాచారం అందించారు. వెంటనే కుటుంబసభ్యులు వెళ్లి చూడగా, ఇంట్లో ఒక గోనెసంచి మూట కనిపించగా అది తీసి చూడగా అందులో రాములమ్మ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉంది. రాములమ్మ మృతిపై అనుమానం ఉందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వజ్రేశ్‌యాదవ్‌కు అభినందనల వెల్లువ


డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను శాలువాతో అభినందిస్తున్న బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్

ఘట్‌కేసర్ రూరల్/ఘట్‌కేసర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజ్‌గిరి కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను పలువురు కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సత్కరించి అభినందించారు. బోడుప్పల్‌లోని ఆయన నివాసంకు సోమవారం కాంగ్రెస్ నాయకులు అభిమానులు పెద్దఎత్తున చేరుకొని వజ్రేశ్‌యాదవ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, మాజీసర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి, నాయకులు కందకట్ల సందీప్‌రెడ్డి, కవాడి వామన్‌రెడ్డి, జంగయ్యముదిరాజ్, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా వజ్రేశ్‌యాదవ్‌ను కాంగ్రెస్ నాయకులు మహేశ్‌గౌడ్, ముత్యాలు యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని, బొక్క ప్రభాకర్‌రెడ్డి, మీసాల మల్లేష్, సుదాకర్‌రెడ్డి తదితరులు కలిశారు.

కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం పోయింది

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్


కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకుడికి కండువాకప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

వికారాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందని మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో మర్పల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుడు రావులపల్లి గ్రామానికి చెందిన వడ్ల బ్రహ్మచారి ఆనంద్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, నాయకులు మేక చంద్రశేఖర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సురేష్, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు గొల్ల రమేష్, శేఖర్‌రెడ్డి, పోచారం వెంకట్ రెడ్డి, కోళ్ల రాజు, రాచన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పాటు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న అగసర నందిని

శామీర్‌పేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు క్రీడలతో పాటు అన్నిరంగాల్లోనూ రాణించి అత్యున్నత స్థాయికి ఎదగాలని అంతర్జాతీయ క్రీడాకారిణి అగసర నందిని పిలుపునిచ్చారు. తూంకుంటలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్స్‌లో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఖేలో ఇండియా స్పోర్ట్స్ అథారిటీ వారు సోమవారం సంయుక్తంగా నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా లీగ్ బాలికల అథ్లెటిక్స్ క్రీడాపోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో రాణించి మేడ్చల్ జిల్లాకు గొప్ప పేరు తేవాలని హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కూరపాటి రాజశేఖర్, జాయింట్ సెక్రెటరీ రాజు, ఉపాధ్యక్షులు అశోక్, ప్రభుదాస్, నాగర్‌కర్నూల్ కార్యదర్శులు స్వాములు, నమ్మయ్య, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి మృతదేహాల అప్పగింత

- కుటుంబసభ్యులకు సన్మానం


దాతలను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

మేడ్చల్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మృతదేహాలను దానం చేసిన కుటుంబసభ్యులను మల్లారెడ్డి మెడికల్ కాలేజ్‌ఫర్ ఉమెన్స్‌లో సోమవారం సన్మానించారు. 'బాడీ డొనేషన్ ఏగిఫ్ట్ ఫెలిసిటేషన్ ఆఫ్ డోనర్ ఫ్యామిలీ' అనే కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించి మృతదేహాలను మెడికల్ కళాశాలలకు దానం చేసిన కుటుంబ సభ్యులకు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తమిళనాడు ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సుధా శేషయ్య, మల్లారెడ్డి విద్యాపీఠ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ అనిల్‌కౌల్, అమ్మ ఐ ఆర్గాన్ అండ్ బాడీ డొనేషన్ సంస్థ అధ్యక్షుడు ఈశ్వర లింగం పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు


వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రాజువర్మ, ఎస్ఐ శివకృష్ణలు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామని పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ సీఐ రాజువర్మ హెచ్చరించారు. ఆయన సోమవారం సాయంత్రం ఎస్ఐ శివకృష్ణతో కలిసి ఘట్‌కేసర్-రాంపల్లి రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్లు లేకున్నా, నంబర్ ప్లేట్లను మార్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వర్‌రావు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.